క్లుప్తంగా

కాజీపేట నుంచి కాశీకి ప్రత్యేక రైలు నడిపించాలి

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్ నుంచి కాశీ యాత్రకు ప్రత్యేక రైలు నడిపించాలని భద్రకాళి దేవస్థాన ఆస్థాన పండితుడు అయినవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి సూచించారు. కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ వందలాది మందికి కాశీ యాత్రకు వెళ్లాలని ఉన్నప్పటికీ సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో మిన్నకుండిపోతున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సాయికృష్ణ శర్మ, మేనేజర్ రవి, గంగుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగుల సేవలు హర్షణీయం



కరీమాబాద్: రెవెన్యూ రిటైర్డ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ క్లబ్ సేవలు హర్షణీయమని వరంగల్ జిల్లా కలెక్టర్ గోపి ప్రశంసించారు. ఈమేరకు కలెక్టర్ గోపిని శనివారం కలిసి గ్రామీణ ప్రాంతాల గ్రంథాలయాల అభివృద్ధి కోసం రూ.25 వేల విలువ గల పుస్తకాలను క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రంథాలయాల్లో ఈ పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఉప్పలయ్య, మార్గం కుమారస్వామి, కటంగూర్ నర్సింహరెడ్డి, చిమ్మని నరేందర్, సిరిపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో శ్రమిస్తే సీఏలో ఉత్తమ ఫలితాలు



వరంగల్: విద్యార్థులు ఏకాగ్రతతో కష్టించి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆధ్యా అకాడమీ డైరెక్టర్ కేపీ.నాయుడు అన్నారు. ఇటీవల సీఏలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పోచమ్మమైదాన్‌లోని భారతి డిగ్రీ కళాశాలలో శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ప్రణాళిక, మార్గనిర్దేశం, కష్టపడి చదివితే సీఏలో విజయం సాధించవచ్చని వివరించారు. సమావేశంలో అకాడమీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్‌జోన్ డీసీపీని కలిసిన టీఎన్‌జీఓ నేతలు

వరంగల్ క్రైం: ఇటీవల ఈస్ట్‌జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన పుల్లా కరుణాకర్‌ను టీఎన్‌జీవోఎస్ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, శనిగరపు శ్యామ్‌సుందర్, ఇందిరా ప్రియదర్శిని, రాజ్యలక్ష్మి, లక్ష్మీప్రసాద్, యమున, శిరీష, తదితరులు ఉన్నారు.

ఆ స్కూల్‌పై చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీచైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు బొట్ల నరేష్, ల్యాదల్ల శరత్, యార ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శంభునిపేటలోని శ్రీచైతన్య (రెనాల్ట్) స్కూల్‌ను విద్యార్థి సంఘాల నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రెనాల్ట్ స్కూల్‌లో శ్రీచైతన్య పేరు మీద విద్యార్థులకు ఇచ్చిన అడ్మిషన్లను వారు పరిశీలించారు. అనంతరం ఎంఈఓ విజయ్‌కుమార్‌ను విద్యార్థి సంఘాల నాయకులు కలిసి శ్రీచైతన్య స్కూల్‌పై పలురకాల సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం వారితో పాటు ఎంఈఓ విజయ్‌కుమార్.. రెనాల్ట్ స్కూల్‌ను సందర్శించారు.

అదనపు రుసుముతో 'పది' ఫీజు గడువు పెంపు

కాళోజీ సెంటర్: ఏప్రిల్–23లో నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు రూ.1000 అదనపు రుసుముతో చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈనెల 15 వరకు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 16న బ్యాంక్ చలాన్ ద్వారా ఫీజు చెల్లించి 17న డీఈఓ కార్యాలయంలో నామినల్ రోల్స్ సకాలంలో సమర్పించాలని సూచించారు.

చాంబర్ మీటింగ్ వాయిదా

వరంగల్ రూరల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం సాయంత్రం నిర్వహించాల్సిన సమావేశం వాయిదా పడింది.

పోతన విజ్ఞానపీఠం వార్షికోత్సవం

- కళాకారిణి రజనిశ్రీకళకు మహాకవి పోతన పురస్కారం ప్రదానం

హన్మకొండ కల్చరల్: వరంగల్‌లోని పోతన విజ్ఞాన పీఠం 36వ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు జరగనున్న కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు శనివారం పలు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పోతన విజ్ఞానపీఠం ఆడిటోరియంలో పీటం కార్యదర్శి గందె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎన్ వీఎస్.చారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం వివిధ పాఠశాల విద్యార్థులకు శ్రీమద్రామాయణంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సీనియర్ నటుడు జేఎస్.శర్మ మహారాజా రాణాప్రతాప్ ఏకపాత్రాభినయం అలరించింది. అనంతరం వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో సీనియర్ నటుడు దేవరాజు రవీందర్ దర్శకత్వం వహించిన మాడిశెట్టి రమేష్ నిర్వహణలో విజయానిరుద్ధం అనే పౌరాణిక పద్యనాటకం ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాటక, సినీ, టీవీ కళాకారిణి రజనిశ్రీకళకు మహాకవి పోతన పురస్కార బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీరామోజు సుందరమూర్తి, చెనుమల్ల శ్రీధర్, జూలూరు నాగరాజు, కళాకారులు పాల్గొన్నారు.



రజనిశ్రీకళకు పురస్కారం అందజేస్తున్న సభ్యులు



పౌరాణిక పద్యనాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం



వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అయిలయ్య

కేయూ క్యాంపస్: కేయూలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన సదస్సును ఇటీవల నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య శనివారం సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ చందులాల్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎన్‌సీసీ కేడెట్‌ను అభినందిస్తున్న వీసీ, తదితరులు

ఎన్‌సీసీ కేడెట్ నవీన్‌కు వీసీ అభినందన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఈసీఈ విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ కేడెట్ ఇస్లావత్ నవీన్‌ను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ శనివారం అభినందించారు. ఈఏడాది జనవరి 26వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్‌లో కేడెట్ ఇస్లావత్ నవీన్ పాల్గొని మెడల్ సాధించారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులపై చిన్నచూపు తగదు

కాజీపేట రూరల్: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను చిన్నచూపు చూడరాదని, వారిని ఆదరించి ప్రేమను పంచి మనోధైర్యం కల్పించాలని డీసీపీ ఎండి.అబ్దుల్ బారీ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట ఫాతిమానగర్ లోడి సాంఘిక సేవా కార్యాలయంలో కారితాస్ ఇండియా స్నేహహస్తం ప్రాజెక్ట్ సహకారంతో కేన్సర్ వ్యాధిపై శనివారం సదస్సు జరిగింది. అంతకు ముందు ర్యాలీ చేపట్టారు. కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు, హెచ్ఐవీ పిల్లలకు లోడి సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. లోడి సంస్థ డైరెక్టర్ ఫాదర్ డి.విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ లోడి సంస్థ ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధిగ్రస్తుల సేవలను విస్తరిస్తామని అన్నారు. అనంతరం 35 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, 150మంది హెచ్ఐవీ పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్, దుస్తులు పంపిణీ చేశారు.



ర్యాలీలో పాల్గొన్న విజయపాల్ రెడ్డి, తదితరులు

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దామెర కృష్ణ

వరంగల్: ఈనెల 6నుంచి 10వ తేదీ వరకు పైడిపల్లిలో 1161 (నిమ్మాయిచెరువు) సర్వే నంబర్‌లో నిర్వహించనున్న సాంస్కృతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు దామెర కృష్ణ పిలుపునిచ్చారు. నిమ్మాయిచెరువు వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి స్ఫూర్తి పొందిన ప్రజా కళాకారులు తమ జీవన విధానంతో ప్రజా కళలను అంతర్భాగం చేసుకుని అనేక ఉద్యమాల్లో ముందుండి ప్రజలను చైతన్య పరచారని గుర్తుచేశారు. ఈటెల్లాంటి తమ పాటలతో ప్రజా కంటకుల ఆట కట్టించారని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా నిర్మాణ బాధ్యుడు గన్నారపు రమేష్, మండల కార్యదర్శి బుస్స రవీందర్, గుండె బద్రి, చిట్యాల సువర్ణ, వెంకన్న పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు

హన్మకొండ చౌరస్తా: నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ చిట్టిమల్ల కుశాల్‌భరత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులకు కారు డ్రైవింగ్, సెల్ రిపేర్, కంప్యూటర్ కోర్సులతో పాటు మహిళలకు ప్రత్యేకంగా కుట్టు మిషన్, బ్యూటీపార్లర్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 30రోజుల పాటు శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు, వివరాల కోసం 93907 54965 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సరస్వతీదేవిగా రాజరాజేశ్వరిదేవి



హన్మకొండ కల్చరల్: శిశిర నవరాత్రుల్లో భాగంగా లలితాజయంతి సందర్భంగా వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరిదేవి దేవాలయంలో అమ్మవారిని లక్షా 97వేల గాజులతో అలంకరించారు. అర్చకుడు లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని రంగురంగుల మట్టిగాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణశర్మ మాట్లాడుతూ ఆదివారం ఉదయం మహాపూర్ణాహుతితో శిశిర నవరాత్రులు పరిసమాప్తి అవుతాయని, సాయంత్రం 6గంటలకు పౌర్ణమి పూజలో గాజులను భక్తులకు ప్రసాదంగా అందజేస్తామని తెలిపారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

కాజీపేట: నానాటికి పెరుగుతున్న సాంకేతికతను ఉపయోగించుకుంటూ నేరగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని, ఈక్రమంలో స్మార్ట్ ఫోన్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. కాజీపేట 61వ డివిజన్ వెంకటాద్రినగర్ కాలనీలోని విక్టర్ ఐటీఐలో విద్యార్థులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని అన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు మాచర్ల శ్వేత, రవికుమార్‌లతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి

టెన్త్ విద్యార్థుల అధ్యయన శిబిరం ప్రవేశపరీక్ష



ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విద్యారణ్యపురి: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల టెన్త్ విద్యార్థులకు హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షల అధ్యయన శిబిరం ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహించారు. ఈ పరీక్షకు 150మంది విద్యార్థులు హాజరైనట్లు హైస్కూల్ హెచ్ఎం ప్రభాకర్ తెలిపారు. 12ఏళ్లుగా వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధి జగ్గయ్య మాట్లాడుతూ పదవతరగతి పరీక్షల అధ్యయన శిబిరాన్ని ఈనెల 8నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 400మందిని ఎంపిక చేసి తొర్రూరులో 50 రోజులపాటు శిబిరాన్ని నిర్వహించి, సబ్జెక్టు నిపుణులతో విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన చేయనున్నట్లు ఆయన తెలిపారు.

కంటి వెలుగులో వరంగల్ ఆదర్శం కావాలి

కరీమాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'కంటి వెలుగు'లో వరంగల్ జిల్లా ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ గోపి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం కంటి వెలుగుపై మండలాల వారీగా కంటి వైద్య నిపుణులు, వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ గోపి మాట్లాడుతూ కంటి వెలుగుకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చేలా కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రోజు 300 మంది అర్బన్ ఏరియాలో 400 మంది టార్గెట్‌గా నిర్దేశించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో క్యాంపులను పరిశీలించాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, క్వాలిటీ కంట్రోల్ అధికారి డాక్టర్ వంశీధర్, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు

వరంగల్ క్రైం: కాకతీయ యూనివర్సిటీ పెద్దమ్మగడ్డ రోడ్డులో డబ్బాల వద్ద రోడ్డుపై ఉన్న కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రదేశానికి శనివారం మార్చినట్లు తెలిపారు.

మెడికోకు వైశ్య ఫెడరేషన్ ఆర్థికసాయం

రామన్నపేట: వరంగల్ గాంధీనగర్‌లోని లేబర్‌కాలనీకి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మెడికో బూడిద గాయత్రికి వరంగల్ జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సభ్యులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఎంబీబీఎస్ చదువుతున్న గాయత్రి.. రెండవ సంవత్సరానికి ఫీజు చెల్లించకపోవడంతో హాల్‌టికెట్ ఇవ్వబోమని కళాశాల యజమాన్యం తేల్చిచెప్పిన విషయాన్ని వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు పుల్లూరి మధు, ప్రధాన కార్యదర్శి గుమ్మడవెల్లి సురేష్ దృష్టికి గాయత్రి తండ్రి బూడిద వెంకటేశ్వర్లు తీసుకెళ్లారు. దాంతో వారు స్పందించి రూ.5,100 నగదు అందజేశారు. కార్యక్రమంలో భద్రకాళి దేవాలయం మాజీ ధర్మకర్త తోనుపునూరి వీరన్న, పబ్బతి అమర్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న వైశ్య ఫెడరేషన్ సభ్యులు

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

కాశిబుగ్గ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుతున్న పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ల్యాదల్ల శరత్, బొట్ల నరేష్, యార ప్రశాంత్, చుక్క ప్రశాంత్, వినయ్, సాగర్, రవి, రమేష్, నవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికి బీజేపీ'

నయీంనగర్: ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా 54వ డివిజన్ హనుమాన్‌నగర్, ఫైన్ ఫంక్షన్ హాల్ ప్రాంతాల్లో పార్టీ హనుమకొండ అధ్యక్షురాలు రావు పద్మ శనివారం ఇల్లిల్లు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహానగరంలో కేంద్రం చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో అన్నీ సమస్యలే నెలకొన్నాయని విమర్శించారు. అంతర్గత రోడ్ల అధ్వానంగా ఉన్నాయని, డ్రైయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఎద్దేవాచేశారు. ప్రజా సమస్యలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కురిమిండ్ల సది, జిల్లా ఉపాధ్యక్షుడు పాశికంటి రాజేంద్రప్రసాద్, జిల్లా నాయకులు దొంతుల వాసుదేవరెడ్డి, తోపుచర్ల మధుసూదన్, నర్మెట్ల శ్రీనివాస్, అరణ్యరెడ్డి, రమణ, వెంకట్, రాజు, ఓంప్రకాష్, శ్రీకాంత్, వినీత్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



డివిజన్‌వాసితో మాట్లాడుతున్న రావు పద్మ

ఆటపాటలతో విద్యనందించడం అభినందనీయం

హసన్‌పర్తి: ఆటపాటల ద్వారా విద్యనందించడం అభినందనీయని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలోని మాంటిస్సోరీ ప్రైమ్ ఇంటర్నేషనల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల తమ ఆకాంక్షలకు పిల్లలపై రుద్ది వారిని ఒత్తిడి గురి చేయొద్దని అన్నారు. నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ప్రశ్నించేతత్వం ఎక్కడ ఉంటుందో అక్కడే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాంటిస్సోరీ గ్రూప్ ఆఫ్ చైర్మన్ నేదుంతుండం జోస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ గుగులోతు దివ్యారాణి, మాంటిస్సోరీ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు గండ్ర సుధాకర్‌రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు టి.సుధాకర్, గండ్ర హరీష్, జోష్, రాజిరెడ్డి, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, రైతు బంధుసమితి మండల కోఆర్డినేటర్ విజయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

సంక్షిప్తంగా

432 మంది క్యాన్సర్ బాధితులు

గీసుకొండ: వరంగల్ జిల్లాలో పలు రకాల క్యాన్సర్లతో 432 మంది బాధపడుతున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 182 మంది బ్రెస్ట్ క్యాన్సర్, 130 మంది నోటి క్యాన్సర్, 120 మంది సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు క్యాన్సర్‌పై తమ సిబ్బంది, అధికారులు అవగాహన కలిగిస్తున్నారని, సరైన ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారు సంబంధిత వైద్యాధికారుల వద్ద చికిత్స పొందాలని సూచించారు.

భాషా పండితులు, పీఈటీల జేఏసీ నిరసన

విద్యారణ్యపురి: భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే తొమ్మిది, పదో తరగతులకు బోధన చేపట్టబోమని హెచ్ఎంలకు వినతిపత్రాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం రాత్రి నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జేఏసీ బాధ్యులు భద్రయ్య, రమేష్, లక్ష్మినారాయణ, శ్రీహరి, పూర్ణచందర్, ప్రసాద్, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడే మార్గనిర్దేశకుడు

హసన్‌పర్తి: సమాజానికి ఉపాధ్యాయుడే మార్గ నిర్దేశకుడని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి క్రాస్‌లోని ఏకశిల టెక్నో స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికూల ఆలోచనలను పక్కన పెట్టి గమ్యం వైపు అడుగు వేయాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివితే విజయం సొంతమవుతుందని అన్నారు. విద్యార్థి శక్తి సామర్థ్యాలను ఉపాధ్యాయుడు మాత్రమే గుర్తించగలుగుతాడని పేర్కొన్నారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యనందించినప్పుడు విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ కొండల్‌రెడ్డి, గౌరు సువిజారెడ్డి, జితేందర్‌రెడ్డి, రిటైర్డ్ అధ్యాపకుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారసత్వం, సంస్కృతిపై వీడియో కాంటెస్ట్

హన్మకొండ: ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ఓరుగల్లు, కాకతీయుల కళావైభవం, ప్రాచీన కట్టడాలు, చెరువులు, దేవాలయాల (వారసత్వం, సంస్కృతి) విశిష్టతను చాటే 'వీడియో కాంటెస్ట్' నిర్వహించనున్నట్లు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు పోటీల్లో పాల్గొని ఓరుగల్లు విశిష్టతను వీడియో రూపంలో పొందుపర్చాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీడియో నిడివి 3 నుంచి 4 నిమిషాలు ఉండాలని తెలిపారు. ఫిబ్రవరి 15 సాయంత్రం 5గంటలలోపు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 80749 66782, 80741 62934, 90639 95609 నంబర్లలో సంప్రదించాలని కోరారు. మొదటి బహుమతి కింద 10వేలు, రెండవ బహుమతి 5వేలు, మూడవ బహుమతి 3వేల నగదు బహుమతి అందించనున్నట్లు వివరించారు. ఈనెల 18న హనుమకొండలోని కుడా మైదానంలో జరగనున్న శివరాత్రి వేడుకల్లో వీడియోలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌కు పలువురి అభినందన

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సిక్తా పట్నాయక్‌ను టీఎస్ఎస్ఓ సంఘం నాయకులు, సభ్యులు కలెక్టరేట్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డు ప్రసాద్, అధ్యక్షుడు పసునూరి ప్రసాద్, సెక్రటరీ సుద్దాల సుకుమార్, కార్యవర్గ సభ్యులు మహమ్మద్ ఫాహిమొద్దీన్, కొట్టి దివ్య, నాగవెల్లి రమ్య, సంతోష్‌కుమార్, సుమన్, అనిల్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు భూక్యా నరసింహనాయక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండమల్ల రవి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు వంశీధర్, సందీప్, ప్రధాన కార్యదర్శి పొట్లపెల్లి రవీందర్ రావు, కోశాధికారి అజ్మీరా చిమన్‌నాయక్, కార్యవర్గ సభ్యులు మంజుల, సునీల్ పాల్గొన్నారు.

మార్కెట్ సాధారణ సమావేశం

వరంగల్ రూరల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సాధారణ సమావేశాన్ని శనివారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి అధ్యక్షతన మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో గతేడాది ఆగస్టు 18 నుంచి ఈఏడాది జనవరి వరకు మార్కెట్‌కు వచ్చిన ఆదాయం లెక్క వెల్లడించలేదు. రూ.8.56 కోట్లతో చేపట్టిన పనుల పురోగతిపై చర్చించారు.

సింహగర్జన సభను విజయవంతం చేయండి

నయీంనగర్: ఎస్ఎస్‌బీఎం మహాసేన తలపెట్టిన సింహగర్జన సభను విజయవంతం చేయాలని బీసీ సెల్ మహిళా తెలంగాణ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు మహరాజు అంజలి కోరారు. ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారమే లక్ష్యంగా ఏప్రిల్ నెలలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న సింహగర్జన సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కల్యాణి ఆస్పత్రిలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు



క్యాన్సర్ పరీక్ష చేసుకున్న మహిళలతో వైద్యులు

హన్మకొండ చౌరస్తా: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని కల్యాణి ఆస్పత్రిలో ఆరుగురు మహిళలకు గర్భాశయ ముఖద్వారా పరీక్షలను శనివారం ఉచితంగా చేశారు. అనంతరం ప్రముఖ వైద్యురాలు పర్బా అంజనీదేవి మాట్లాడుతూ ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధి నివారణకు అనేక ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు స్వేచ్ఛ, శ్రీదేవి, ఐశ్వర్య, అనూష పాల్గొన్నారు.